ముషీరాబాద్‌లో భారీ వర్షం


గంగపుత్ర కాలనీపార్కులో నిలిచిపోయిన వర్షపునీటిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది


ముషీరాబాద్ బాప్టిస్ట్ చర్చి వీధిలో ఏరులై పారుతున్న వరదనీరు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలలో మోకాలి లోతు వర్షపు నీరు ఏరులై పారింది. పార్శిగుట్ట, ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి, బాప్టిస్ట్ చర్చి వీధుల్లో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు. గంగపుత్ర కాలనీలోని ఎంసీహెచ్ పార్కులో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో పార్కు స్థలం చెరువును తలపించింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పూసగోరక్‌నాథ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి జీహెచ్‌ఎంసీ ఏఈ మురళికి ఫిర్యాదు చేశారు. వెంటనే యంత్రాల సహాయంతో వర్షం నీటిని తొలగించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో సైతం వర్షపునీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

బీజీయూఎస్ అంబర్‌పేట కన్వీనర్‌గా వెంకటస్వామిగౌడ్


వెంకటస్వామిగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) అంబర్‌పేట డివిజన్ కన్వీనర్‌గా సుంకరి వెంకటస్వామిగౌడ్ నియమితులయ్యారు. మంగళవారం ఉత్సవ సమితి నియోజకవర్గ కన్వీనర్ జి.ఆనంద్‌గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అలాగే డివిజన్ కో–కన్వీనర్లుగా దయాకర్‌యాదవ్, అనంతరాములు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి, నాయకులు నాగభూషణంచారి, గోవర్ధన్‌రెడ్డి, పాండురంగయ్య, మైలారం రాజు, యాదగిరి, మనోజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట కో–కన్వీనర్‌గా పాండురంగయ్య

కాచిగూడ: బీజీయూఎస్ అంబర్‌పేట కో–కన్వీనర్‌గా బీజేపీ నేత డా. పుట్ట పాండురంగయ్యను నియమితులయ్యారు. ఈ సందర్భంగా పాండురంగయ్యకు మంగళవారం అంబర్‌పేట కన్వీనర్ ఆనంద్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు. బర్కత్‌పురలో జరిగిన ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, నాయిని బుచ్చిరెడ్డి, వెంకటేష్, దయాకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పాపయ్యశాస్త్రి రచనలు.. తెలుగు సాహితీ సంపదలు

ఎమ్మెల్సీ మధుసూదనాచారి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: జంధ్యాల పాపయ్యశాస్త్రి రాసిన ప్రతి కవితా కరుణ రస ప్రధానమేనని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభలో మంగళవారం ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా కవి, సంపాదకులు జంధ్యాల పాపయ్యశాస్త్రి యాదిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపయ్యశాస్త్రి రాసిన కుంతీకుమారి, పుష్పవిలాసం, కరుణశ్రీ కావ్యాలపై వక్తలు ప్రసంగించారు. ఈ కావ్యాలు తెలుగు సాహితీ సంపద అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు త్రినాథరావు, జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


మధారి కిషన్(ఫైల్)

నల్లకుంట: అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయి కృష్ణ మధాన్ కుటుంబ సభ్యులతో కలిసి నల్లకుంట సిద్ధార్థ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్నారు. పదేళ్లుగా అనారోగ్యం(పోలార్డ్ డిస్కార్డ్)తో బాధపడుతున్న ఆయన తండ్రి మధారి కిషన్(59) ఈనెల 12న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అన్ని చోట్ల వెతికినప్పటికీ తండ్రి ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన సాయి కృష్ణ మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, రత్నసాయిచంద్


బీజేపీ బైక్ ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు

చిక్కడపల్లి: జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ ఆవిష్కరించి దేశభక్తిని చాటాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం అశోక్‌నగర్‌లోని నివాసంపై ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయించద్, నేతలు సురేష్, స్వామివారు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

కాచిగూడ: స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాచిగూడలోని వీర సావర్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరసావర్కర్, మహాత్మగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి ఎంతో మంది దేశ స్వాతంత్య్రం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. దేశ స్వాతంత్య్ర సమరయోధులకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు ఎక్కడున్నా వాటిని శుభ్రం చేసే కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్లు వై.అమృత, కన్నె ఉమా రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.వినోద్‌యాదవ్, సుభాష్‌పటేల్, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, ఎంబీ కిషోర్‌కుమార్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలు


ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేస్తున్న మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్‌రాజ్

నల్లకుంట: దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా (హర్ ఘర్ తిరంగా) కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం నల్లకుంటలో బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్ రాజ్ తన ఇంటిపై సతీమణి రేణుతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొ. ఎం.వెంకట్‌రావు తెలిపారు. ఈ శిబిరంలో రాండమ్ బ్లడ్ షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో, వెయిట్, ఐ చెకప్, డెంటల్ చెకప్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థో, జనరల్ ఫిజీషియన్, స్కిన్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ నం: 040-24659405, 94916 27404.

ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

శిక్ష విధించిన సికింద్రాబాద్ రైల్వే సెకండ్ మెట్రోపాలిటన్ కోర్టు

కాచిగూడ: ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణికుడికి కత్తి చూపించి సెల్ ఫోన్, నగదు లాక్కొన్న కేసులో రైల్వే కోర్టు ముగ్గురు నిందితులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించిందని కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ రాగి ఎల్లప్ప తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే సెకండ్ మెట్రోపాలిటన్ కోర్టు నిందితులకు మంగళవారం ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని ఆయన తెలిపారు. ఉందానగర్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడైన రాములు కుమారుడు కేశవ (20) ని నిందితులు కత్తితో బెదిరించి ఒక సెల్ ఫోన్, నగదును దొంగిలించి పారిపోయారు. బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాచిగూడ రైల్వే పోలీసులు సమగ్ర విచారణ జరిపిన అనంతరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తో సెకండ్ ఎంఎం రైల్వే కోర్టు సికింద్రాబాద్‌లో అభియోగ పత్రం సమర్పించామని చెప్పారు. ప్రభుత్వ పీపీ జి.రోజారాణి వాదనలు వినిపించారన్నారు. న్యామూర్తి ఎండీ గౌస్ పాషా ముగ్గురు నిందితులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారని ఆయన తెలిపారు.

రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలను నిలిపేయాలి


పద్మశాలి సంఘం ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సుదర్శన్

అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలను నిలిపేయాలని రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల కమిషనర్ భువనగిరి ఉదయ్ కుమార్‌కు ఆ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగడం లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. సంఘం నిబంధన 10 ప్రకారం నిర్వహించాల్సిన ఎన్నికలు అందుకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని అన్నారు. సంఘం రూపొందించిన నిబంధనల ప్రకారం ఎన్నికలు జరగని పక్షంలో తాము హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిక్క దేవదాసు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


శేఖర్‌రెడ్డి వీధిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాకేష్

ముషీరాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేష్ సూచించారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని శేఖర్‌రెడ్డి వీధిలో బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏఎన్‌ఎం సుహాసిని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో...

రాష్ట్రీయ బాలస్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లారా, ఏఎన్‌ఎం శ్రీదేవి, స్కూల్ కార్యదర్శి రతన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు పోలీసులకు సహకరించాలి


ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్యను సన్మానిస్తున్న నర్సింగ్‌ప్రసాద్

ముషీరాబాద్: నేరాలను అదుపు చేసేందుకు ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో పోలీసులకు సహకరించాలని ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య అన్నారు. ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నర్సయ్యను ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, శ్రీనివాస్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో బోగీలను 3 నుంచి 6కు పెంచాలి



ఆర్‌టీసీ క్రాస్‌రోడ్ మెట్రోస్టేషన్ వద్ద సంతకాల సేకరణ చేపట్టిన సీపీఐ(ఎం) నాయకులు

ముషీరాబాద్: మెట్రో రైల్లో పెరిగిన రద్దీకి అనుగుణంగా బోగీలను 3నుంచి 6కు పెంచాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని మెట్రోస్టేషన్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. మెట్రో రైల్‌లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రయాణం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ వెళ్లే లైన్లలో రైలు ఎక్కడ దిగడం కూడా చాలా కష్టంగా ఉన్నదన్నారు. పీక్ టైమ్‌లో అయితే రైలు లోపల నిలబడలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కొన్ని సందర్భాలలో ఏసీ కూడా సరిపోక ఊపిరాడని పరిస్థితి ఉంటోందని పేర్కొన్నారు. ప్రయాణికుల ఇబ్బంది దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న మూడు బోగీల స్థానంలో ఆరు బోగీలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, మారన్న, రమేష్, బాబు, పాషా, మల్లయ్య, రాజయ్య, నాగరాజు, వసీం, రఘు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస బోనాలు


బోనంతో వస్తున్న ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంవో డా. జయలక్ష్మి


అమ్మవారి పూజలో ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో మంగళవారం శ్రావణ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆస్పత్రి ప్రాంగణంలోని దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనం నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ జయలక్ష్మి తదితరులు బోనం ఎత్తుకున్నారు. శివసత్తుల సిగాలు, పోతురాజుల నృత్యాలు, తొట్టెల ఊరేగింపుతో ఆస్పత్రి ప్రాంగణం జాతరను తలపించింది.

◆ అనంతరం ఆస్పత్రి ఫార్మసీ భవనం వద్ద ఉన్న చిత్తారమ్మ అమ్మవారికి పూజలు చేసి బోనం నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్, పూర్వ ఆఫీస్ సూపరింటెండెంట్ దాసు, పూర్వ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, నాయకులు లావణ్య, వేణు, సతీష్ కుమార్, రాజ్‌కుమార్, పద్మ, హెచ్‌ఐ నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర నామ పారాయణం



చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలోని భవాని మాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గాజులు, పూలమాలలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు లలితా సహస్ర నామా పారాయణం చేశారు. అదే విధంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకులు కాశీనాథశర్మ, భవనందశర్మ, గోపాలాచారి, జగన్‌మోహనాచారి, రామాచారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదర్శన

కాచిగూడ: 78వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మిమిక్రీలో ఎం.శ్రీనివాస్ ఈనెల 14వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో 15 నిమిషాల్లో 78 రకాల ధ్వనులను తన కంఠంతో ప్రదర్శించి వరల్డ్ రికార్డు సొంతం చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అకాడమీలో శ్రీనివాస్ చేపట్టే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదర్శన పోస్టర్‌ను హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్ గౌడ్ ఆవిష్కరించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు హాజరై శ్రీనివాస్ చేసే మిమిక్రీ ప్రదర్శనను రికార్డ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, జగదీశ్ చంద్ర, కె.రాజేశ్వరి, కరీం, అమృత రెడ్డి, నిధి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పాతర వేసే నూతన క్రిమినల్ చట్టాలను రద్దుచేయాలి

కాచిగూడ: ప్రజాస్వామ్యాన్ని పాతర వేసే నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు కొత్త చట్టాలు అత్యంత క్రూరమైన నేర చట్టాలని ఆయన అన్నారు. నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి స్వార్థ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చట్టాలు తీసుకొచ్చిందని అన్నారు. స్వాంత్ర్యోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నేతలు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నేతలు షేక్ మహమూద్, జగన్ గౌడ్, నితిన్, ప్రవీణ్, రజనీకాంత్, అంజన్, అరుణ్, సంపూర్ణేష్ పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి


గగన్‌మహల్ ఏవీ కళాశాల వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, దోమలగూడ మాజీ కార్పొరేటర్ టి. రవీందర్‌లు యువతకు పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంసీసీ మహేందర్‌బాబు ఆధ్వర్యంలో గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాల వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహం, పూల్‌బాగ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, పరిమళ్ కుమార్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, పీఎన్.చారి, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

పండ్లతో శ్రీభూలక్ష్మి దుర్గాదేవి అలంకరణ

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని గాంధీకుటీర్ నారాయణగూడలో కొలువుదీరిన శ్రీభూలక్ష్మీ దుర్గాదేవి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దాదాపు రూ.25 వేలతో తీసుకువచ్చిన వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఈ వేడుకలకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వృత్తి మెకానిక్.. ప్రవృత్తి చోరీలు

- నిందితుడిని అరెస్టు చేసిన చిక్కడపల్లి పోలీసులు
- బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలింపు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ సీతయ్య, ఎస్ఐ నాగరాజులు

చిక్కడపల్లి: ద్విచక్ర వాహనం చోరీ చేసి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేవారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ సీతయ్య కేసుకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బావర్చీ హోటల్‌కు వెళ్లిన మహమ్మద్ ఖలిద్ సైఫుల్లా ప్లాటినం బైక్‌ని ఈనెల 11వ తేదీన రాత్రి 10.30గంటలకు బావర్చి హోటల్ పార్కింగ్‌లో పార్క్ చేశాడు. తర్వాత వచ్చి చూసేసరికి తన బైక్ లేకపోవడంతో చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని బాగ్‌లింగంపల్లి ఏరియాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు బైక్ దొంగ సంతోష్ పట్టుబడ్డాడు. ఇతడు ముషీరాబాద్ జెమినికాలనీకి చెందిన ఉడుగల్ల సుమంత్ అలియాస్ సంతోష్(25) వృత్తి రీత్యా బైక్ మెకానిక్. బైక్‌ను స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కాచిగూడలో పోలీసుల విస్తృత తనిఖీలు

కాచిగూడ: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాచిగూడ పోలీసులు తనిఖీలను విస్తృతం చేశారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, రైల్వే ప్లాట్‌ఫామ్స్, ఆర్టీసీ బస్ స్టేషన్, ఆర్టీసీ బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, పోస్టాఫీస్ ఏరియా, రైల్వేస్టేషన్ బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు హెచ్.నరేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


కాచిగూడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు